క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రాంతీయ సంచాలకులు హరికృష్ణ



పొన్నూరు: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని.. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల వద్ద శుభ్రత పాటించాలని పురపాలక శాఖ కమిషనర్, ప్రాంతీయ సంచాలకులు సూర్యదేవర హరికృష్ణ అన్నారు. పట్టణ పరిధిలో గురువారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, అధికారులతో కలిసి ఆయన పలు వార్డులలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. 27వ వార్డులోని ఈద్గా పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించి స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నిడుబ్రోలులోని డంపింగ్ యార్డు, వాటర్ ప్లాంట్‌ను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పెదకాకాని పీఏసీఎస్ కమిటీ ప్రమాణస్వీకారం

పెదకాకాని: పెదకాకాని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కమిటీ ఎంపిక గురువారం జరిగింది. పీఏసీఎస్ చైర్మన్‌గా నంబూరుకు చెందిన మాకిరెడ్డి జయరామిరెడ్డి, డైరెక్టర్లుగా పెదకాకానికి చెందిన తోట నారయ్య, వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన తోట వెంకటరమణలను ఎన్నుకున్నారు. త్రీమెన్ కమిటీ సభ్యులచే పెదకాకాని పీఏసీఎస్ కార్యాలయంలో సెక్రటరీ మొవ్వా వెంకటేశ్వరరావు ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, సొసైటీ సిబ్బంది రెడ్డి దుర్గాప్రసాద్, నాగేశ్వరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చేపట్టాలి

కేంద్రీయ సస్యరక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ సహాయ అధికారి మానస



ప్రత్తిపాడు: పత్తి పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేంద్రీయ సస్యరక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ సహాయ అధికారి వై.మానస అన్నారు. మండలంలోని గొట్టిపాడులో గురువారం పొలం బడి కార్యక్రమాన్ని ఏవో షేక్ సుగుణ బేగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్లాంట్ ప్రొటెక్షన్ సహాయ అధికారి మానస స్థానిక ఏవోతో కలిసి పత్తి పైర్లను పరిశీలించి, తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత పత్తి పొలంలో ఉన్న నీటిని బయటకు పంపి ఎకరానికి 20 నుంచి 25 కిలోల యూరియా, 10 నుంచి 15 కిలోల పొటాష్ బూస్టర్ డోస్‌గా పిచికారీ చేసుకోవాలన్నారు. సూక్ష్మపోషకాల లోపం నివారణకు ఫార్ములా-4 ఉపయోగించాలన్నారు. గులాబి రంగు పురుగు నివారణకు ఎకరానికి నాలుగు నుంచి ఆరు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది షణ్ముఖ, రైతులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్ర అధ్యాపకుడికి డాక్టరేట్



చేబ్రోలు: చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకుడు రావినూతల ఏసుపాదంకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసినట్లు ప్రిన్సిపాల్ వి.శ్రీదేవి గురువారం తెలిపారు. విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాల రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ అధ్యాపకుడు ఎం.డేవిడ్‌రాజు పర్యవేక్షణలో ఏసుపాదం 'మాలిక్యులర్ ఇంటరాక్షన్స్ ఆఫ్ డ్రగ్స్ ఇన్ ఆక్వస్ సొల్యూషన్స్-థర్మో ఫిజికల్ అండ్ మాలిక్యులర్ డైనమిక్స్ సిమ్యులేషన్ స్టడీస్ ఆన్ మెమంటైన్ డోర్జాల మైడ్ అండ్ మాక్సిఫ్లాక్సానిన్ హైడ్రో క్లోరైడ్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ పొందిన ఏసుపాదంకు ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

రైతులకు విరివిగా వ్యవసాయ రుణాలు

జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మణిపాల్‌రెడ్డి

ప్రత్తిపాడు: రైతులకు విరివిగా వ్యవసాయ రుణాలను మంజూరు చేయాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మణిపాల్ రెడ్డి అన్నారు. ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. హాజరైన జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మణిపాల్ రెడ్డి రైతులకు అందిస్తున్న వ్యవసాయ రుణాలు, స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలు ప్రభుత్వ లక్ష్యాల ప్రకారం చేరుకోవాలన్నారు. వెలుగు ఏపీడీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మహిళల జీవనోపాధులను మెరుగుపరిచేందుకు స్వయం ఉపాధి యూనిట్లను నెలకొల్పి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు అందిస్తున్నామన్నారు. బ్యాంకు అధికారులు, వెలుగు ఏపీఎంలు, ఏవోలు పాల్గొన్నారు.

జగన్మాత.. నమోస్తుతే



ప్రత్తిపాడు గంగాపార్వతీ సమేత దండేశ్వరాలయంలో...



ప్రత్తిపాడు వేణుగోపాలస్వామి దేవస్థానంలో...



పొన్నూరు కోదండ రామాలయంలో...



పొన్నూరు వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

ప్రత్తిపాడు: దసరా ఉత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. గురువారం ప్రత్తిపాడులోని గంగా పార్వతీ సమేత దండేశ్వరాలయంలో పార్వతి అమ్మవారు కాత్యాయనీదేవిగా, సీతారామస్వామి, వేణుగోపాలస్వామి వార్ల దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారు మంగళగౌరిగా, అద్దంకమ్మ తల్లి దేవస్థానంలో కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

పొన్నూరు: పొన్నూరులో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం పట్టణంలోని కోదండ రామాలయంలో అమ్మవారు లలిత త్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీలు, అధికారులు పర్యవేక్షించారు.

అంబేడ్కర్ చైర్, యూనివర్సిటీ ఆఫ్ డెమోక్రసీల మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్‌తో కాకినాడలోని యూనివర్సిటీ ఆఫ్ డెమోక్రసీ ఫౌండేషన్ ఎంఓయూ కుదుర్చుకుంది. ఏఎన్‌యూలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య ఆర్ శివరాం ప్రసాద్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య వై అశోక్ కుమార్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఆఫ్ డెమోక్రసీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ జి.అబ్బయ్య, సెక్రటరీ డాక్టర్ ఎ.శ్రీనివాస్, మెంటార్ డాక్టర్ కె.కృష్ణమోహన్‌లు ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు. ఈ ఎంఓయూ ద్వారా ఏఎన్‌యూ, యూనివర్సిటీ ఆఫ్ డెమోక్రసీ సంయుక్తంగా పలు సామాజిక అభివృద్ధి, పరిశోధన కార్యక్రమాలను నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య అశోక్ కుమార్, యూనివర్సిటీ ఆఫ్ డెమోక్రసీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ జి.అబ్బయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, అంబేడ్కర్ చైర్ సిబ్బంది డాక్టర్ వి.శ్రీనివాస్, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ప్రతీకగా గ్రామాలు: ఎంపీడీవో



ప్రత్తిపాడులో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవ అవగాహన ర్యాలీ



మొక్కలు నాటుతున్న నాబార్డు జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ శరత్ బాబు

ప్రత్తిపాడు: గ్రామాలు స్వచ్ఛతకు ప్రతీకలుగా ఉండాలని ఎంపీడీవో కె.శివపార్వతి అన్నారు. మండల పరిధిలోని పదహారు గ్రామ పంచాయతీల్లో గురువారం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, అనుబంధ సంస్థల్లో శ్రమదానం చేసి వ్యర్థాలను తొలగించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో కార్యాలయాన్ని శుభ్రం చేసి, వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ఒక్క పంచాయతీ బాధ్యతే కాదని.. ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం స్థానిక కార్యాలయం నుంచి స్వచ్ఛత-పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ చేపట్టారు. అధికారులు స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షేక్ ఆదం షఫీ, స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ డబ్బూరి శ్రీనివాసరావు, బ్యాంకర్లు, అధికారులు, కార్యాలయ సిబ్బంది, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చేబ్రోలులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం

చేబ్రోలు: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్ కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు, సిబ్బంది గురువారం చేబ్రోలు యూబీఐ శాఖ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది, ఖాతాదారులు ప్రతిజ్ఞ చేశారు. నాబార్డు జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ జి.శరత్‌బాబు మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి, దేశాన్ని పరిశుభ్రంగా, చెత్త రహితంగా ఉంచాలనే లక్ష్యంతో చేపట్టిన మంచి కార్యక్రమం ఇది అన్నారు. కార్యక్రమంలో లీడ్ జిల్లా మేనేజర్ ఆర్.మహిపాల్ రెడ్డి, చేబ్రోలు యూబీఐ శాఖ మేనేజర్ వి.వెంకటేశ్వర్లు, సిబ్బంది, విద్యార్థులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

చలపతిలో ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నగర శివారులోని లాంనందున్న చలపతి ఫార్మసీ కళాశాల ఎగ్జామినేషన్ సెల్ ఆధ్వర్యంలో అసెస్‌మెంట్ 360 డిగ్రీస్, ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్ మెకానిజమ్స్, బ్లూ ప్రింటింగ్ అండ్ అడ్జుడికేషన్ ఇన్ ఫార్మసీ అనే అంశంపై ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్‌ను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ ఫార్మసీ విద్యలో ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్ విధానాలు, విద్యార్థుల మదింపు ప్రక్రియలో ఉపయోగించే బ్లూ ప్రింటింగ్ పద్ధతులు, అలాగే అడ్జుడికేషన్ వంటి అంశాలను వివరించారు. గవర్నమెంట్ ఉమెన్స్ కాలేజ్ రిటైర్డ్ రీడర్ ఇన్ ఇంగ్లీష్ ప్రొఫెసర్ బి.వరలక్ష్మి మాట్లాడుతూ ఫార్మసీలో సమగ్ర మూల్యాంకనం ఎంతో అవసరమని, అది విద్యార్థుల విద్యా ప్రగతిని మాత్రమే కాకుండా వారి నైపుణ్యాలను, వ్యక్తిత్వాన్ని, వృత్తి పరమైన సిద్ధతను కూడా ప్రతిబింబించాలన్నది ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని చర్చలు జరిపారు. అనంతరం కళాశాల యాజమాన్యం అతిథులను ఘనంగా సత్కరించింది. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

• ప్రధాన రహదారే ఇలా ఉంటే.. ఎలా..!



గుంతలతో అధ్వానంగా ఉన్న రహదారి

పొన్నూరు: పట్టణ ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మున్సిపల్ కార్యాలయం వద్ద లోతైన గుంతలు ఏర్పడి రహదారి ప్రమాదకరంగా మారింది. రేపల్లె, బాపట్ల, చీరాల పట్టణాలకు వెళ్లే ప్రయాణికులు ఈ మార్గం నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. దీనిపై పలుచోట్ల గోతులు ఏర్పడటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. వాహన రాకపోకలతో రద్దీగా ఉండే రహదారిపై లోతైన గుంతలు ఉన్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారిలోనే ఇలా ఉంటే ప్రయాణం ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదాలను అరికట్టేందుకు కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి గోతులు పూడ్చి ఇబ్బందులు తీర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

• విరిగిన రెయిలింగ్.. పొంచి ఉన్న ప్రమాదం



పొన్నూరు: పట్టణంలోని నిడుబ్రోలు వంతెనపై రెయిలింగ్ లేక ప్రమాదకరంగా మారింది. ఇటీవల ట్రాక్టర్, లారీ ఢీకొన్న ఘటనలో వంతెన పై భాగంలో రెయిలింగ్ విరిగింది. అయితే ఈ ఘటన జరిగి నెల గడిచినా సంబంధిత అధికారులు వంతెనకు మరమ్మతులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే వంతెనపై భద్రత లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో మరింత భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో స్మార్ట్ ఐడియా కాంటెస్ట్



స్మార్ట్ ఐడియా కాంటెస్ట్‌లో విజేతలైన విద్యార్థులతో ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల యాజమాన్యం



ఎన్ఎస్ఎస్ డే వేడుకల్లో విజేతలైన విద్యార్థులతో ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ స్థాయి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025 పోటీలకు ప్రాథమికంగా కళాశాల నుంచి 45 టీములను సిద్ధం చేసినట్లు ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. గురువారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులను స్టార్టప్, ఇన్నోవేషన్ ఇండియా లక్ష్య సాధనలో భాగస్వామ్యం చేయడానికి నిపుణుల పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్మార్ట్ ఐడియా కాంటెస్ట్‌లో వ్యవసాయ, ఫుడ్ టెక్నాలజీ, గ్రామీణాభివృద్ధి, రోబోటిక్స్, పునరుత్పాదకత, సస్టైనబుల్ ఎనర్జీ వంటి సృజనాత్మక ఆలోచనలను విద్యార్థులు ప్రదర్శించారు. మొత్తం 174 ఐడియాలు అందగా, వాటిలో ప్రతిభ కనబరిచిన జట్లకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులకు విద్యతో పాటు స్టార్టప్ దిశగా ప్రోత్సహిస్తూ శిక్షణను అందించడం ద్వారానే జాతీయ స్థాయిలో గుర్తింపు సాధిస్తున్నారని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎంవీపీసీ రావు, డాక్టర్ ఆర్ హఫీజ్‌బాషా, డాక్టర్ కె.కర్తీక పవన్, డాక్టర్ శోభ, డాక్టర్ రాధిక, జ్యూరీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ఎన్ఎస్ఎస్ డే వేడుకలు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి విద్యతో పాటు సామాజిక సేవా దక్పథాన్ని అలవరచుకోవాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. గురువారం చౌడవరంలోని కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం, సైన్స్ మోడల్స్, టెక్నికల్ ప్రజెంటేషన్స్ వంటి పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందజేశారు. అనేక విపత్తు సమయాల్లో తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సహాయక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో కళ్లం ఇంజనీరింగ్ కళాశాలకు అవార్డులు



అవార్డులను చూపుతున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నగర శివారులోని చౌడవరం గ్రామంలో కళ్లం ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో అత్యధిక ఇంటర్న్‌షిప్‌లు పూర్తి చేసిన సందర్భంగా ఏఐసీటీఈ గుర్తింపు పొందిన ఎడ్యు స్కిల్స్ కంపెనీ వారు బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇంజనీరింగ్ కళాశాల-2025 అవార్డును ప్రదానం చేశారని కళాశాల చైర్మన్ కళ్లం మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో 3, 4 సంవత్సరాల 1500 మంది విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అమెజాన్ వెబ్ సర్వీసెస్, జెడ్ స్కేలర్ తదితర అంశాలలో ఇంటర్న్‌షిప్ కోర్సులను పూర్తి చేశారన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ కోర్సులకు సమన్వయకర్తగా వ్యవహరించిన డాక్టర్ పీఎల్ మాధవరావు, డీన్ శిక్షణ ఉపాధి కల్పన విభాగం అధిపతికి జాతీయ స్థాయిలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎక్సలెన్సీ అవార్డును ప్రదానం చేసారన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఉమాశంకరరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును అందించటం తమ కళాశాల లక్ష్యమని తెలిపారు. అవార్డులు పొందిన కళాశాల ఇంజనీరింగ్ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, ఉపాధి కల్పన అధికారికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

మహిళల ఆరోగ్యమే లక్ష్యం



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది

ప్రత్తిపాడు: మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్ అన్నారు. మండల పరిధిలోని నడింపాలెంలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన డాక్టర్ మేరి యునిస్ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార శిబిరాన్ని సందర్శించారు. అనంతరం వారు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మేరియునిస్ మాట్లాడుతూ వర్షాల ప్రభావం వలన గ్రామాల్లో అంటు వ్యాధులు, జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. అందుచేత ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో చెల్లమ్మ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

తుమ్మలపాలెం సుప్రీం ఎల్‌టీసీలో ఎంపీడీవోల పర్యటన



తుమ్మలపాలెంలోని సుప్రీం ఎల్‌టీసీ వద్ద ఎంపీడీవోల బృందం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండల పరిధిలోని తుమ్మలపాలెంలో ఎంపీడీవోల బృందం పర్యటించింది. బాపట్ల ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ నుంచి గురువారం మూడు జిల్లాలకు చెందిన 52 మంది ఎంపీడీవోలు ఫీల్డ్ విజిట్‌గా తుమ్మలపాలెం గ్రామంలోని సుప్రీం ఎల్‌టీసీ (ఎస్‌డబ్ల్యూపీసీ)ని సందర్శించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్త సేకరణ ఎలా జరుగుతుంది, ఎల్‌టీసీలో వర్మీ కంపోస్టు ఎరువు ఎలా తయారు చేస్తున్నారు, పొడి చెత్త వేరు చేయు విధానంతో పాటు పరసరాల పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలు.. తదితరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు స్వయంగా పరిశీలించారు. అనంతరం గ్రామ సర్పంచ్ చల్లా నాగమల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవోలు వారి అభిప్రాయాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.శివపార్వతి, డిప్యూటీ ఎంపీడీవో షేక్ అదం షఫీ, ఈటీసీ రిసోర్స్ పర్సన్‌లు వెంకటేశ్వరావు, శ్రీనివాసరావు, డీపీఆర్‌సీ ఆర్పీ అనూరాధ, స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా, సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాక్‌థాన్



హ్యాక్‌థాన్‌లో న్యాయనిర్ణేతలు, విద్యార్థులు

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ మెకానికల్ బ్లాక్‌లోని ద సాల్ట్ త్రీడీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాక్‌థాన్-2025 నిర్వహించారు. ఇంజనీరింగ్ కళాశాలలోని అన్ని విభాగాలకు చెందిన విద్యార్థులు 10 టీములుగా ఏర్పడి మొత్తం 60 మంది పాల్గొని 17 ఐడియాలను ప్రదర్శించారు. ఇక్కడ ఎంపికైన టీములు నేషనల్ లెవల్ హ్యాక్‌థాన్‌లో పాల్గొంటాయని ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్ తెలిపారు. ఈ హాక్‌థాన్‌కు న్యాయ నిర్ణేతలుగా కనెక్ట్ నాలెడ్జ్ సెంటర్ సీఈవో ఎం.సత్యకుమార్, ఆర్ అండ్ డీ ప్రాజెక్ట్ మేనేజర్ జె.సమరేష్‌కుమార్, క్రయో టెక్నాలజీ జీసీవీ శ్రీకర్, ఎక్స్‌కోర్ ఇండస్ట్రీస్ సీఈవో జశ్వీలు వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ లింగరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.గోపీకృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, వివిధ విభాగాల సమన్వయకర్తలు డాక్టర్ ఎడ్ల సునీత, డాక్టర్ కొండా చైతన్య, డాక్టర్ యు.సతీష్ కుమార్, డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ డి.అఖిలజాన్, డాక్టర్ బి.పూర్ణచంద్రశేఖర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, సాంకేతిక నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని నిరసన



పెదకాకాని: ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని స్థానిక సుందరయ్య కాలనీలో గురువారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమానికి సీపీఎం శాఖ కార్యదర్శి బి.బాబురావు అధ్యక్షత వహించారు. సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకొని సుందరయ్య కాలనీ, స్వర్ణపురి కాలనీ, ఎస్టీ కాలనీ, వడ్డెర కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, జాన్‌హోస్పరస్ కాలనీల్లో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యేకు చెప్పినా ఇవ్వడం లేదన్నారు. ఎన్ని అర్జీలు పెట్టినా సమస్య పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వం పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు బురదగుంట సాంబయ్య, రాఘవయ్య, సుందరయ్య కాలనీ వాసులు పాల్గొన్నారు.

వేలం ప్రకటన

IN THE COURT OF THE I ADDL. CIVIL JUDGE(SENIOR DIVISION):: GUNTUR
EP No.12/2022 in O.S.No.486/2016

Between:
Smt. Bolleddu Sailaja ....DHR
And
M/s. Ayyan Constructions, Rep. by Prop. Smt. Fathima Shamila ....JDR

[illegible]

Schedule: The immovable property situated at Guntur Dt., Nalapadu Sub Division, Pedapalakaluru(V) Panchayth, present Guntur New Municipal Corporation area, D.No.266, Property being bounded by: **East:** Property of N.Vijaya Lakshmi Kantharmma, **South:** 30 Feet Road, **West:** Property of M.Prakasam and others, **North:** Property belongs to AELC. Within these boundaries an extent of 888.84Sq.yds equivalent to 743.18 Sq.mts of vacant land in which the defendant is having undivided right of 40 Sq.Yds or 33.44Sq.Mts along with all ancillary and easement rights etc., therein.

B-Schedule: The immovable property situated at Guntur Dt., Nalapadu Sub Division, Pedapalakaluru(V) Panchayth, present Guntur New Municipal Corporation area, D.No.266, WINDSOR ANNAM apartment, Flat No-SF-3 property being bounded by: **East:** Open to Sky, **South:** Open to Sky, **West:** Common Passage and Stair Case, **North:** Lift and Open to Sky. Within these boundaries an extent of 875 Sq.Fts of unfinished flat SF-3 and 100 Sq.fts of car parking at Stilt along with common passages, stair case, Balcony and Drainage and electrical fittings with all ancillary and easement rights etc., therein.

[illegible] 20,00,000/-
[illegible] 21,00,000/-
[illegible] 17-10-2025
[illegible] 24-10-2025.

[illegible] 9491600840